సాక్షి విశాఖపట్నం

బుధవారం ; 18 ; సెప్టెంబర్ ; 2024



ఘనంగా అనంతుని జయంతి

కుంతీ మాధవస్వామి ఆలయంలో మంగళవారం అనంత పద్మనాభ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. 8లో



తాగునీటి వనరుల సంరక్షణ

జిల్లాలో సహజ తాగునీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు 8లో



పీఎంఏవై 2.0 పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం భువనేశ్వర్‌లో ప్రారంభించగా విశాఖ నుంచి ఎంపీ శ్రీ భరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబు వీక్షించారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు



విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట : జిల్లాలోని ఒకటి నుంచి 19 ఏళ్లలోపు గల 5,20,891 మంది బాలబాలికలు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఏయూ హైస్కూల్ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. అన్ని స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలకు ఇప్పటికే ఈ మాత్రలను పంపించినట్లు తెలిపారు. మంగళవారం మాత్రలు వేసుకోని వారి కోసం ఈనెల 25న మాప్ అప్ రౌండ్ కార్యక్రమం చేపట్టామని, ఆ రోజు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, డీఈవో ఎల్.చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారి ఆర్.శ్రీదేవి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీలో అడ్మిషన్లు ప్రారంభం



ఎంబీబీఎస్‌లో చేరిన వారికి ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో మంగళవారం ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఆల్ ఇండియా ర్యాంకర్లు(1303, 1766)తో పాటు రాష్ట్ర కోటాలో పలువురు రిపోర్ట్ చేశారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రాష్ట్ర కోటాలో ఆంధ్రా మెడికల్ కాలేజీకి 213 సీట్లు కేటాయించింది. ఇందులో ప్రస్తుతం 200 సీట్లను ఈ నెల 19లోగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. మిగిలిన 13 సీట్లు ప్రత్యేక కేటగిరీలో చివర్లో భర్తీ చేస్తామని ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఈ నెల 20 నుంచి ఆల్ ఇండియా కోటా రెండవ విడత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట: ప్రపంచపు తొలి వాస్తు శిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచిన విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ–అభివృద్ధి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విశ్వకర్మ జీవిత విశేషాలను వివరించారు. విశ్వకర్మ తత్వాన్ని అందరూ అర్థం చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై గత ఐదు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ముగిశాయి. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ భోగమండపంలో వేంజేపచేసి పంచామృతాలు, గంగధార జలాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

‘ఉక్కు’కు ఉరి!



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగదంటూ తేల్చేసిన కేంద్రం

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు లేఖకు సమాధానం

ఇందులో భాగంగానే ప్లాంట్ నిర్వీర్యానికి ప్రణాళికలు

- కేంద్రం చర్యలకు మద్దతుగా కూటమి ప్రభుత్వం కుట్రలు
- పరిశ్రమకు కేంద్రం సహకరిస్తుందని ఎంపీ శ్రీభరత్ కల్లబొల్లి మాటలు
- కార్మికులు, ఉద్యమ నేతలపై జనసేన నేత బొలిశెట్టి విషపూరిత వ్యాఖ్యలు
- రెండు పార్టీలు కలిసి ఉద్యమాన్ని అణగదొక్కే ప్రయత్నం
- ఉక్కు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు కార్మిక సంఘాల పునరుద్ఘాటన

విశాఖ సిటీ : తెలుగువారి ఆత్మగౌరవం మంటకలవనుందా? ఉక్కు పరిశ్రమకు ఉరి తాళ్లు బిగుసుకుంటున్నాయా? స్టీల్‌ప్లాంట్‌ను దివాలా సంస్థగా చూపించి ప్రైవేటుకు అప్పగించే ప్రక్రియ జరిగిపోతుందా? ఉక్కు పరిశ్రమను కాపాడతారని విశ్వసించి గెలిపించిన ప్రజలను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచనుందా? స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామన్న బీజేపీతో అంటకాగిన పార్టీలను గెలిపించారంటేనే.. ఆ సెంటిమెంట్ లేదన్న అభిప్రాయంతో కేంద్రం ఉందా? అందుకే పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు వేగంగా అడుగులు వేస్తుందా? అంటే అన్నింటికీ అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అనుమానమే కాదు.. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పార్లమెంట్‌లో స్టీల్‌ప్లాంట్ గురించి అడిగిన ప్రశ్నకు.. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తున్నట్లు లేఖ ద్వారా తేటతెల్లం చేశారు.

జగన్ చెప్పినట్టే..

ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి.. విశాఖ పర్యటనలో ప్రసంగిస్తూ.. కూటమి నేతలను గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తారని, వారిని నమ్మొద్దని చెప్పారు. కానీ ప్రజలు కూటమి నేతల మాయమాటలు నమ్మి వారిని గెలిపించారు. ఈసారైనా పరిశ్రమపై భారం తగ్గించేందుకు సొంత గనులు కేటాయిస్తారని అందరూ భావించారు. కానీ అందుకు విరుద్ధంగా అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే స్టీల్‌ప్లాంట్‌లో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూసేశారు. ఉత్పత్తిని 20 శాతానికి తగ్గించేశారు. అధికారుల బదిలీల ప్రక్రియను వేగవంతం చేశారు. కొత్త ఆర్డర్లు బుకింగ్‌ను నిలిపివేశారు. పాత ఆర్డర్ల మేరకు కూడా ఉత్పత్తి చేయలేని పరిస్థితి నెలకొంది. స్టీల్‌ప్లాంట్‌ను దివాలా సంస్థగా ప్రకటించే రోజులు దగ్గరలోనే ఉన్నట్లు ప్రస్తుత పరిస్థితులను చూస్తే అర్థమవుతోంది. ఎన్నికలకు ముందు జగన్ చెప్పినట్లే ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ పరిస్థితి నెలకొంది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి కూడా స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపిందని స్పష్టం చేశారు. దీనిని బట్టి త్వరలోనే స్టీల్‌ప్లాంట్ యాజమాన్య హక్కు మార్పునకు కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కూటమి నేతల బండారం బట్టబయలు

నిన్న, మొన్నటి వరకు విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులు ఉద్యమ నాయకుల వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కార్చారు. అవసరమైతే తమ పదవులకు రాజీనామాలు చేసేస్తామని ప్రకటించేశారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం సహకారం అందిస్తుందని చెప్పినట్లు ఎంపీ శ్రీభరత్ కల్లబొల్లి మాటలు చెప్పారు. ఇప్పుడు ఎంపీ గొల్ల బాబూరావుకు కేంద్ర మంత్రి రాసిన లేఖతో ఈ కూటమి ప్రజాప్రతినిధుల అసలు బండారం బట్టబయలైంది. ఒక్కసారిగా వారి స్వరాలు మారిపోయాయి. ఇప్పటివరకు కార్మిక, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఉద్యమానికి సహకారం అందిస్తామని చెప్పిన నేతలు.. ఇప్పుడు ఆ సంఘాలపై తీవ్ర పదజాలంతో దుమ్మెత్తిపోయడం ప్రారంభించారు. జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ కార్మిక సంఘాల నేతలను తీవ్రంగా అవమానించారు. కార్మికులే స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్నారని, వారిని చాచి పెట్టి కొట్టాలని తీవ్ర వ్యాఖ్యలు చేసి అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు.

ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం



ఒకవైపు కేంద్ర మంత్రి స్పష్టంగా చెప్పినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం ఇంకా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం అవసరమైతే తమ పదవులకు రాజీనామా చేస్తామని చెబుతుండడం హాస్యాస్పదం. వాస్తవానికి తెలుగుదేశం మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోంది. చంద్రబాబు కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకుంటానని హెచ్చరిస్తే.. బీజేపీ పెద్దలు దిగొచ్చే అవకాశాలు ఉన్నాయని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు ఆశాభావంతో ఉన్నారు. కానీ ఇప్పటివరకు చంద్రబాబు గానీ, పవన్ కల్యాణ్ గానీ ఈ విషయంపై నోరెత్తడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధుల రాజీనామా డ్రామాల వల్ల ఉపయోగం ఉండదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ విషయంలో కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురాని పక్షంలో తెలుగువారి ఆత్మగౌరవం ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదముంది. ఈ విషయంపై కార్మిక సంఘాల నేతలు కూడా ఉక్కు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

బొలిశెట్టి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ **స్టీల్‌ప్లాంట్ కార్మిక** సంఘాలపై చేసిన **వ్యాఖ్యలను తక్షణమే** ఉపసంహరించుకోవాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ నిర్ణయం వెలువడిన అనంతరం అన్ని యూనియన్లు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి 1,314 రోజులుగా దీక్షలు చేస్తుంటే, బొలిశెట్టి ఒళ్లు కొవ్వెక్కి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత పార్టీ ఉన్నా.. వేరే పార్టీ జెండాలు మోసే జనసేన పార్టీ నాయకుల లాంటి వాళ్లం కాదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాకముందు ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకువెళ్లాలని డిమాండ్ చేసిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ఆక్షేపించారు. సమావేశంలో యూనియన్ ఉప ప్రధానకార్యదర్శి మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, జి.వెంకటరమణారెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, జనార్దన్, పుల్లారావు పాల్గొన్నారు.

ఆయన హోదా ఏంటో చెప్పాలి



జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ కార్మిక సంఘాలపై చేసిన ఆరోపణలు పూర్తిగా అబద్ధం. జనసేనలో ఆయనకు ఉన్న హోదా ఏంటో చెప్పాలి. బొలిశెట్టి వ్యాఖ్యలు జనసేనకు నష్టం కలిగిస్తాయి. తక్షణం కార్మిక సంఘాలపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి.

– బొడ్డు పైడిరాజు, ప్రధాన కార్యదర్శి, ఉక్కు శ్రామిక సంఘం

వారి పేర్లు బయట పెట్టాలి



స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్న కార్మిక సంఘాల పేర్లు బయట పెట్టాలి. నిజంగా ఆయన దగ్గర సమాచారం ఉంటే బహిర్గతం చేయాలి. అంతేకానీ.. ఊరకనే విమర్శలు చేయడం సరికాదు. ఆయన వ్యాఖ్యలు నిజమైతే ఆ సంఘాల పేర్లు బయటపెడితే కార్మికులే తగిన బుద్ధి చెబుతారు.

– కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి, స్టీల్ బీఎంఎస్

అందరినీ నిందించటం సరికాదు



జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ కార్మిక సంఘాలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం సరికాదు. స్టీల్‌ప్లాంట్ కోసం చిత్తశుద్ధితో కృషి చేసే కార్మిక సంఘాలు ఉండబట్టే మూడేళ్లకు పైగా దీక్షా శిబిరం కొనసాగుతోందని ఆయన తెలుసుకోవాలి.

– జి.గణపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ హెచ్ఎంఎస్

జనసేన వైఖరి వెల్లడించాలి



అధికారంలోకి రాకముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పవన్ కల్యాణ్ విషం కక్కారు. ఒక ఎంపీ ఉంటే పార్లమెంట్‌లో బీజేపీని నిలదీసేవాడినని చెప్పారు. ఇప్పుడు నలుగురు ఎంపీలు, 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. పవన్ వైఖరేమిటో వెల్లడించాలి. లేనిపోని కబుర్లతో కార్మిక సంఘాలను విమర్శించడం సరికాదు.

– డీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి, డీవీఆర్ ట్రేడ్ యూనియన్

అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకువెళ్లాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అఖిలపక్ష పార్టీలను ప్రధాని వద్దకు తీసుకువెళ్లాలి. లేనిపక్షంలో ధర్నా చేస్తానని ప్రకటించిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. సమస్యను తప్పుదోవ పట్టించడానికి జనసేన నేత బొలిశెట్టి అనవసర విమర్శలు చేస్తున్నారు. ఆయనకు స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడే హక్కు లేదు.

– కె.పరంధామయ్య, ప్రధాన కార్యదర్శి, యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్

స్టీల్‌ప్లాంట్‌కు మంచి జరిగేలా ప్రవర్తించాలి



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా ఉద్యమం చేస్తున్న కార్మిక సంఘాలపై బురద జల్లడం హేయం. ఆయనకు చేతనైతే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, ప్రైవేటీకరణ ఉపసంహరించేందుకు కృషి చేయాలి. అంతేగానీ ఉద్యమాన్ని నీరుగార్చేలా విమర్శలు చేయడం సరికాదు.

– బి.డేవిడ్, ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్

‘భూదాన్’ భూముల రక్షణకు తక్షణ చర్యలు

- విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: ప్రభుత్వ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకుంటామని విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్ అన్నారు. పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం బోరవానిపాలెం సమీపంలో సర్వే నంబర్ 132లోని 50.56 ఎకరాల్లో ఆక్రమణకు గురవుతున్న భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ సర్వే నంబర్‌లో 132లో సుమారు 3 ఎకరాల మేర భూదాన్ భూములను ఎక్స్ సర్వీస్‌మన్ పేరుతో అధికార పార్టీ పెద్దల కనుసన్నల్లో వారి అనుచరులు కొట్టేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ వ్యవహారంపై ‘సాక్షి’దినపత్రిక ‘భూదాన్ భూములపై కన్ను’శీర్షికతో మంగళవారం కథనం ప్రచురించింది. ఈ కథనం అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెట్టించింది. రెవెన్యూ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. దీంతో ఆగమేఘాల మీద రెవెన్యూ అధికారులు వచ్చి.. భూమును పరిశీలించారు. ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు చేపడతామని ప్రకటించారు. ఇక్కడ ఆక్రమణలు జరగకుండా నిత్యం పరిశీలిస్తామని తహసీల్దార్ చెప్పారు. పరిశీలనలో ఆర్ఐ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ శ్రీనుబాబు, వీఆర్వో సూరిబాబు, గ్రేడ్ వీఆర్వో శ్రీనివాస్ ఉన్నారు. కాగా.. మండలంలో కొమ్మాది, పరదేశిపాలెం రెవెన్యూ గ్రామాల్లో సుమారు 80 ఎకరాలపైనే భూదాన్ భూములు ఉన్నాయి. అయితే ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల దళారులు ఈ భూములు చూపించి విక్రయించేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భూదాన్ భూముల్లో హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇక ఎకోసిస్టమ్‌కు హెల్త్‌కార్డులు

- చిత్తడి నేలలు, అడవుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- ఎన్‌సీఎస్‌సీఎం డైరెక్టర్ డా.రామచంద్రన్ వెల్లడి
- విశాఖలో ప్రారంభమైన ఎకోసిస్టమ్ హెల్త్‌కార్డుల సదస్సు



ఎన్‌సీఎస్‌సీఎం డైరెక్టర్ రామచంద్రన్‌తో పలు సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అటవీ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అటవీ వ్యవస్థను సంరక్షించే విధంగా ఎకోసిస్టమ్ అన్నింటికీ దేశ వ్యాప్తంగా హెల్త్‌కార్డులు నిర్వహించే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్(ఎన్‌సీఎస్‌సీఎం) డైరెక్టర్ డా.పూర్వాజ రామచంద్రన్ తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ ఎడ్యుకేషన్(ఐసీఎఫ్ఆర్ఈ), ఎన్‌సీఎస్‌సీఎం సంయుక్త ఆధ్వర్యంలో ‘ప్రిపరేషన్ ఆఫ్ ఎకోసిస్టమ్ హెల్త్‌కార్డు’ పేరుతో ఓ హోటల్‌లో సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అటవీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తూ శిక్షణ తరగతులు చేపడుతున్నట్లు వివరించారు. ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న అటవీ వ్యవస్థ స్థితిగతులపై చర్చించడంతోపాటు దేశంలో భూ–వినియోగ మార్పులు, స్థిరమైన అభివృద్ధి, చిత్తడి నేలలు.. ఇలా ప్రతి పర్యావరణ వ్యవస్థకు హెల్త్‌కార్డులు రూపొందించే పద్ధతులపై చర్చిస్తున్నామని తెలిపారు. గ్రీన్ ఇండియా మిషన్, అటవీ అగ్ని నివారణ, నిర్వహణ పథకం, ఔషధ మొక్కల సంరక్షణ, స్కూల్ నర్సరీ యోజన, వన్యప్రాణుల ఆవాసాల సమగ్ర అభివృద్ధి తదితర కార్యక్రమాలపై సదస్సులో చర్చించారు. ఎవెన్యూ ప్లాంటేషన్ కోసం పొడవైన మొక్కలను నిర్వహణ, తోటలు, అడవుల సంరక్షణ, రక్షణ విధుల కోసం తనిఖీ మార్గాలు, అటవీ రహదారుల నిర్మాణం, అటవీ నిర్వహణ పద్ధతులపై శాస్త్రవేత్తలు అభిప్రాయాల్ని సేకరించారు. సదస్సులో ఐసీఎఫ్ఆర్ఈ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఐఐఎఫ్ఎం భోపాల్ ప్రొఫెసర్ యోగేష్, ఎన్‌సీఎస్‌సీఎం శాస్త్రవేత్త డా.బెనర్జీ పాల్గొన్నారు.

వైజాగ్.. సూపర్ హిట్



- ఆదాయార్జనలో ఏపీలో నంబర్‌వన్‌గా వైజాగ్ రైల్వేస్టేషన్
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో సత్తాచాటిన వాల్తేరు
- ఎన్ఎస్‌జీ–1 ర్యాంకు స్టేషన్‌గా అప్‌గ్రేడ్
- ఇకపై డిమాండ్‌కి అనుగుణంగా రైళ్ల పరుగులు

సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు డివిజన్ ఏటా మాదిరిగానే ఈసారీ ఆదాయ వృద్ధిలో దూసుకుపోయింది. ముఖ్యంగా డివిజన్‌లోని ప్రధాన రైల్వేస్టేషన్ విశాఖపట్నం.. రాష్ట్రంలో అన్ని స్టేషన్లను వెనక్కి నెట్టి నంబర్ వన్‌గా నిలిచింది. 2023–24 ఆర్థిక సంవత్సర గణాంకాల్ని పరిగణనలోకి తీసుకున్న రైల్వే బోర్డు ఇటీవల ఈ వివరాలను వెల్లడించింది. ప్రయాణికుల రాకపోకల ద్వారా రూ.564 కోట్ల ఆదాయం సొంతం చేసుకుని.. నాన్ సబర్బన్ గ్రూప్(ఎన్ఎస్‌జీ)–1 రైల్వే స్టేషన్‌గా విశాఖపట్నం రైల్వేస్టేషన్ అప్‌గ్రేడ్ అయింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో ఈ కేటగిరీలో నిలిచిన ఏకైక స్టేషన్ విశాఖపట్నం కావడం విశేషం. ఏపీలోని టాప్–30 రైల్వే స్టేషన్లలో కూడా విశాఖ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. అయితే తిరుపతి, విజయవాడతో పోలిస్తే ప్రయాణికుల రాకపోకల విషయంలో వెనుకబడింది. మూడో స్థానంతో సరిపెట్టుకుంది.

జోన్ హెడ్‌క్వార్టర్‌ని పక్కకు నెట్టి..

ప్రయాణికుల రాకపోకల ద్వారా రూ.500 కోట్ల ఆదాయం దాటితే ఎన్ఎస్‌జీ–1 కేటగిరీలోకి స్టేషన్‌ను చేర్చుతారు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఎన్ఎస్‌జీ–2గా విశాఖపట్నం స్టేషన్ ఉంది. తాజాగా నాన్ సబర్బన్ గ్రూప్–1 స్టేషన్ల సరసన నిలిచింది. అయితే జోన్ హెడ్‌క్వార్టర్ అయిన భువనేశ్వర్ ఎన్ఎస్‌జీ–2 కేటగిరీకే పరిమితం కావడం గమనార్హం. ఒడిశా, తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో కీలకంగా చెప్పుకునే భువనేశ్వర్ రైల్వేస్టేషన్ నుంచి 1.22 కోట్ల మంది ప్రయాణికులు మాత్రమే రాకపోకలు సాగించగా.. రూ.493 కోట్ల ఆదాయం ఆర్జించింది.

ఎన్ఎస్‌జీ–1 అయితే లాభాలేంటి?

మౌలిక సదుపాయాలు, రైళ్ల రాకపోకల కోసం స్టేషన్లను కేటగిరీలుగా రైల్వే బోర్డు విభజించింది. నాన్ సబర్బన్ గ్రూప్‌లో 6 కేటగిరీలు, సబర్బన్ గ్రూప్‌లో 3 కేటగిరీలుగా స్టేషన్లు ఉంటాయి. సరకు రవాణా ద్వారా వచ్చే ఆదాయాన్ని మినహాయించి.. కేవలం ప్రయాణికుల రాకపోకల ద్వారా వచ్చే ఆదాయం రూ.500 కోట్లు దాటితే దాన్ని ఎన్ఎస్‌జీ–1 కేటగిరీ స్టేషన్‌గా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ గ్రూప్‌లో చేరిన రైల్వే స్టేషన్‌కు అదనపు సౌకర్యాల్ని సమకూర్చుతారు. దేశవ్యాప్తంగా ఎన్ఎస్‌జీ స్టేషన్లు 5,945 ఉండగా.. 1 కేటగిరీలో కేవలం 28 రైల్వే స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో విశాఖపట్నం స్టేషన్ తాజాగా చేరింది. ఇకపై ఈ స్టేషన్‌లో సమగ్ర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రైల్వే బోర్డు అంగీకారం చెబుతుంది. మంచినీటి ట్యాప్‌లు, వెయిటింగ్ హాల్ సౌకర్యాలు, ప్లాట్‌ఫాంలపై సీటింగ్ ఏర్పాట్లు, ప్లాట్‌ఫాం షెల్టర్‌లు, మూత్రశాలలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లు.. ఇలా అనేక మార్పులు మన రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకోనున్నాయి. మరోవైపు ఎన్ఎస్‌జీ–1 స్టేషన్‌లో ప్రయాణికుల తాకిడికి అనుగుణంగా.. డిమాండ్‌ను బట్టి అదనపు రైళ్లను కూడా కేటాయిస్తారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వాల్తేరు అధికారులు తెలిపారు.

టాప్–3 స్టేషన్లలో ప్రయాణికుల రాకపోకల వివరాలు

రైల్వేస్టేషన్	రిజర్వ్‌డ్	అన్‌రిజర్వ్‌డ్	మొత్తం
విజయవాడ	67,57,602	1,00,81,862	1,68,39,464
తిరుపతి	70,37,350	67,59,083	1,37,96,433
విశాఖపట్నం	66,71,985	66,71,261	1,33,43,246

టాప్–3 స్టేషన్లలో ఆదాయం వివరాలు

రైల్వేస్టేషన్	రిజర్వ్‌డ్	అన్‌రిజర్వ్‌డ్	మొత్తం
విశాఖపట్నం	67,88,12,335	496,28,45,383	564,16,57,718
విజయవాడ	391,93,53,671	136,28,06,517	528,21,60,188
తిరుపతి	403,97,69,941	71,63,26,045	475,60,95,986

సింహాచలం ఈవోగా సుజాత

పూర్వ ఈవోకి ఆత్మీయ వీడ్కోలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ శాఖ నుంచి ఏడాది పాటు డిప్యూటేషన్‌పై వచ్చిన ఎస్.శ్రీనివాసమూర్తిని మాతృశాఖకు పంపించడంతో ఇన్‌చార్జి ఈవోగా సుజాతను నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాతృశాఖకు వెళ్తున్న శ్రీనివాసమూర్తికి దేవస్థానం అర్చకులు, ఉద్యోగులు వీడ్కోలు పలికారు. తనకు సహకరించిన అర్చకులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు, మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూర్వ ఈవో శ్రీనివాసమూర్తికి వీడ్కోలు పలుకుతున్న ఇన్‌చార్జి ఈవో సుజాత, అధికారులు

ఐఏఎస్ యాప్ పేరుతో ఘరానా మోసం

మర్రిపాలెం: అధిక మొత్తం డబ్బులు వస్తాయని ఆశ చూపి.. యాప్ ద్వారా లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలివీ.. ఐఏఎస్(ఇండియన్ అడ్వర్టైజింగ్ సర్వీసెస్ ఆంధ్రప్రదేశ్) యాప్ ద్వారా నిర్వాహకులు పలువురిని సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షించారు. వీడియో లైక్‌ల ఆధారంగా భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. ప్రారంభంలో యాప్‌లో చేరిన ప్రతీ ఒక్కరికి రూ.360 జమ చేయడం ద్వారా విశ్వాసం కల్పించారు. తర్వాత యాప్ నిర్వాహకులు ప్లాన్‌ల పేరుతో డబ్బులు వసూలు చేసి.. లభించిన పాయింట్లకు తగిన నగదు చెల్లించలేదు. దీంతో బాధితులు మురళీనగర్ వద్ద యాప్‌కు సంబంధించిన కార్యాలయం ఉందని తెలుసుకుని.. అక్కడ మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి భవన యజమాని డయల్100కు ఫోన్ చేసి సమాచారం అందించారని కంచరపాలెం పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ వ్యభిచార ముఠా గుట్టురట్టు

అల్లిపురం: మహిళల అక్రమ రవాణా, ఆన్‌లైన్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును నగర పోలీసులు రట్టు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, ముగ్గురు బాధిత మహిళలను కాపాడారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. పలువురు ఆకర్షణీయంగా వెబ్‌సైట్‌లను డిజైన్ చేసి.. పలు వెబ్‌సైట్ల నుంచి మహిళల వివరాలు, కాంటాక్ట్ నంబర్లు సేకరిస్తారు. వేర్వేరు ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి నగరంలోని లాడ్జీలు, హోటళ్లలో ఉంచుతారు. ఏజెంట్ల నుంచి వచ్చిన సమాచారంతో కస్టమర్ల నుంచి డబ్బులు తీసుకుని మహిళలు ఉన్న చోటికి వారిని పంపిస్తారు. ఇలా గుట్టుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ విధంగానే వెబ్ డిజైనర్ రావాడ కామరాజు అలియాస్ దీపక్ www.findbestclass.com ను రూపొందించాడు. వ్యభిచారం కోసం మహిళలను రవాణా చేసే లోకాంటో వెబ్‌సైట్ నుంచి ఏజెంట్ల పేర్లు, ఫోన్ నంబర్లను భద్రపరచుకుని.. వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. వెబ్‌సైట్‌ను సంప్రదించిన కస్టమర్లకు ఏజెంట్ల వివరాలు, మహిళల ఫొటోలు పంపిస్తున్నాడు. తద్వారా కస్టమర్లకు, ఏజెంట్లకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఇందుకోసం డబ్బులు తీసుకుని.. ఏజెంట్లతోపాటు బాధితులకు కమిషన్ అందిస్తున్నాడు. కాగా.. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసుల సహకారంతో దర్యాప్తు ప్రారంభించారు. లాసన్స్‌బే కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న రావాడ కామరాజు, బాడి రాము, మాటూరి రమేష్, మంగేష్ రమేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. రావాడ కామరాజు తాను మహిళల అక్రమ రవాణా కోసం ఉపయోగించే 34 మంది ఏజెంట్ల పేర్లను వెల్లడించాడు. భూపేష్‌నగర్‌లోని లాడ్జీలో ఉంచిన ముగ్గురు బాధిత మహిళల వివరాలతో పాటు ఒక మహిళా ఏజెంట్, మగ ఏజెంట్ పేర్లను తెలియజేశాడు. అతను ఇచ్చిన సమాచారంతో బాధిత మహిళలను విడిపించి.. ఇద్దరు ఏజెంట్లు సూర్యవంశీ, అలీష సుభద్రలను అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు. మహిళలను మభ్యపెట్టి వ్యభిచారం నిర్వహించడం, మహిళల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని సీపీ హెచ్చరించారు. ప్రజలు వెబ్‌సైట్‌లు, ఇతర మాధ్యమాల ద్వారా మహిళలతో అక్రమ వ్యాపారం చేసినా, నిర్వహించినా చట్టప్రకారం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీపీ బాగ్చి స్పష్టం చేశారు.



వైద్య ఆరోగ్య శాఖ కార్మికుల సమ్మె నోటీసు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కార్మికులు జీతాల కోసం ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నెల 30వ తేదీలోగా జీతాలు చెల్లించకపోతే సమ్మె చేస్తామని మంగళవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు నోటీసు అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, సూపర్‌వైజర్ కార్మికులు జీతాల కోసం దశల వారీగా ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కలెక్టర్‌తోపాటు డీసీహెచ్ డాక్టర్ శంకర్ ప్రసాద్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ కార్మికులు 17 రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనలు చేస్తున్నా.. అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని.. ఇదేమని అడిగితే బిల్లులు రాలేదని సాకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య విభాగ కాంట్రాక్ట్ కార్మికులకు మున్సిపల్ కార్మికుల తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాంలు అందజేయాలన్నారు. నమ్మి లక్ష్మి, భవాని, శ్రావణి, కమలమ్మ శ్రీనివాస్ రావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చి బయటకు వస్తున్న యూనియన్ నాయకులు

లారీని కారు ఢీకొని ఇద్దరి దుర్మరణం

డెంకాడ/తగరపువలస: విజయనగరం జిల్లా మోదవలస వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజాము మూడున్నర గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. వివరాలివీ.. విశాఖ నుంచి విజయనగరం వైపు వస్తున్న కారు మోదవలస వద్ద రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నమ్మి మనోజ్‌కుమార్(30), అలమండ శ్యామ్‌కుమార్(31)లు తీవ్రగాయాలతో కారులో ఇరుక్కుపోయి మరణించారు. నమ్మి మనోజ్‌కుమార్ విజయనగరంలోని ఇప్పిలి వీధికి చెందిన వ్యక్తి. ఏడాది కిందటే ఆయనకు వివాహమైంది. అలమండ శ్యామ్‌ప్రసాద్‌ది భీమునిపట్నం మండలంలోని ఆర్.తాళ్లవలస గ్రామం. మృతులిద్దరూ బంధువులే. వారిద్దరూ తిరుపతి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. మృతులిద్దరూ కలిసి విజయనగరంలో ట్రావెల్ వ్యాపారం నిర్వహిస్తుంటారు.



శ్యామ్‌కుమార్(ఫైల్)

తాళ్లవలసలో విషాదం: శ్యామ్‌కుమార్ మృతితో భీమిలి మండలం తాళ్లవలసలో విషాదం నెలకొంది. డిగ్రీ పూర్తయిన శ్యామ్ కుమార్‌కు తల్లి మూర్తమ్మ, భార్య సాయి నిఖిల, 2, 5 ఏళ్ల కుమారులు ఉన్నారు. వీరంతా విశాఖలో ఉండగా శ్యామ్‌కుమార్ విజయనగరంలో ఉంటున్నాడు. శ్యామ్‌కుమార్ మరణవార్త తెలిసిన వెంటనే తాళ్లవలసలోని అతని బంధువులు విజయనగరం మహారాజా ఆసుపత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం శ్యామ్‌కుమార్ మృతదేహానికి తాళ్లవలసలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు మోస్తున్న శ్యామ్‌కుమార్ మృతి పట్ల తాళ్లవలస వాసులు విషాదంలో మునిగిపోయారు.

ఇసుక కొరతతో కార్మికులకు ఉపాధి కరువు

- ఆందోళనలకు పిలుపునిచ్చిన సీపీఎం

డాబాగార్డెన్స్: జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉండటంతో భవన నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కమిటీ బి.పద్మ అధ్యక్షతన మంగళవారం సమావేశమైంది. జిల్లాలో ఇసుక కొరత, నిలిచిన గృహ నిర్మాణాలు, కార్మికుల ఉపాధిపై ప్రభావం, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీకి, చేస్తున్న ప్రకటనలకు.. వాస్తవ పరిస్థితికి పొంతనే లేదన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా ఉచిత ఇసుక విధానం పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున నిర్మాణాలు నిలిచిపోయాయని, వేల సంఖ్యలో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్మికులు, భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన వారు ఎక్కడికక్కడ ఆందోళనలు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు.

సెయిల్‌లో గైస్ విద్యార్థికి కొలువు

10.4 లక్షల ప్యాకేజీతో రికార్డు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) విద్యార్థి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)లో కొలువు సాధించారు. 2020–2023 బ్యాచ్‌కు చెందిన జి.చైతన్యకుమార్ సెయిల్ నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ మేరకు చైతన్య కుమార్‌ను ఆపరేటర్ కమ్ టెక్నికల్ ట్రైనీ ఉద్యోగానికి రూ.10.4 లక్షల వార్షిక ప్యాకేజీతో సెయిల్ సంస్థ ఎంపిక చేసింది. పాలిటెక్నిక్ విద్యతో పది లక్షల ప్యాకేజీ సాధించడం ఒక రికార్డుగా చెప్పుకోవచ్చు. సామాన్య కుటుంబంలో జన్మించిన చైతన్య ఈ ఘనత సాధించడంతో అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఆనందపురం మండలం గుమ్మిడివాని పాలేనికి చెందిన అతని తండ్రి రవికుమార్ సామాన్య రైతు. తల్లి జి.లక్ష్మి గృహిణి. చైతన్య మంగళవారం గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను కలిసి తన ఆనందాన్ని పంచుకున్నాడు. ప్రతి డిప్లమా విద్యార్థి చైతన్యకుమార్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు.



నియామక పత్రాన్ని చూపుతున్న చైతన్య

సామాన్యులకేనా రూల్స్?

బీచ్‌రోడ్డు: వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలనే నిబంధనను పోలీసులు కఠినంగా అమలు చేస్తున్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని కొన్ని రోజులుగా రద్దీగా ఉన్న ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సిరిపురం సర్కిల్ వద్ద తనిఖీలు చేపట్టారు. హెల్మెట్‌లు ధరించని వారిని ఆపి, జరిమానాలు విధించారు. అదే సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పోలీసులు హెల్మెట్లు ధరించకపోయినా.. ఆపకుండా పంపించేశారు. దీంతో 'రూల్స్ మాకేనా.. పోలీసులకు ఉండవా..'అంటూ ప్రజలు గుసగుసలాడారు.



చలాన్లు రాస్తున్న పోలీసులు



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పోలీస్



ముగ్గురితో.. హెల్మెట్ లేకుండా..

'ఉక్కు'పై ద్వంద్వ వైఖరి వీడాలి

ఎంవీపీకాలనీ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయని.. ఇది ఉత్తరాంధ్రకు ద్రోహం చేయడమే అవుతుందని ఉత్తరాంధ్ర పరిరక్షణ వేదిక అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. ఏయూ లైబ్రరీ వద్ద మంగళవారం సంస్థ సభ్యులతో కలసి ఆయన మాట్లాడారు. ఆంధ్రుల హక్కుగా భావించే స్టీల్‌ప్లాంట్‌కు ఈ ప్రాంత ప్రజలతో విడదీయరాని బంధం ఉందన్నారు. ప్లాంట్ ఏర్పాటు కోసం 32 మంది బలిదానాలు చేశారని.. అలాంటి ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్రంతో స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని గతంలో ప్రకటనలు చేసిన పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

రెండున్నర గంటల్లోనే 130 అంశాలపై చర్చ!

డాబాగార్డెన్స్: రెండున్నర గంటల్లోనే 130 అంశాలపై స్థాయీ సంఘ సభ్యులు చర్చించి.. మమ అనిపించేశారు. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 13న నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 280 అజెండా అంశాలు పొందుపరగా.. ఆ రోజున 150 అంశాలను చర్చించారు. మిగిలిన 130 అంశాలకు సంబంధించి మంగళవారం సమావేశమయ్యారు. మేయర్, స్థాయీ సంఘం చైర్మన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేవలం రెండున్నర గంటల వ్యవధిలోనే 130 అంశాలు చర్చించారు. ఇందులో కేవలం ఆరు అంశాలు మాత్రమే వాయిదా వేయడం గమనార్హం.

నేడు కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ బుధవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి రాత్రి 10.15 గంటకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. 19న సాయంత్రం 5 గంటలకు ఏయూలో జరిగే దివ్య కళ మేళాలో పాల్గొంటారు. ఆ రోజు రాత్రి 8.55 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

అన్నా క్యాంటీన్ల ప్రారంభం మళ్లీ వాయిదా

డాబాగార్డెన్స్: అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవం మళ్లీ వాయిదా పడింది. వాస్తవానికి ఈ నెల 13న మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా, విజయవాడ వరదలు కారణంగా వాయిదా పడింది. ఈ నెల 18న మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఏమి జరిగిందో తెలియదు కానీ మళ్లీ వాయిదా పడింది. ఎప్పుడు ప్రారంభిస్తారో ప్రశ్నార్థకంగా మారింది.

వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్‌గా రమేష్

విశాఖ సిటీ: విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) జాయింట్ కమిషనర్‌గా కొమ్మి రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ స్థానంలో విధులు నిర్వర్తించిన రవీంద్రను ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. ఆయన స్థానంలో నియమితులైన రమేష్ బాధ్యతలు తీసుకున్నారు.



28న ఐటీఐలో నాల్గో విడత కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు 4వ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, 27న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు ప్రింట్, అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

రిమాండ్‌కు మానసిక వైద్యుడు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీకి చెందిన మానసిక వైద్యుడు, వక్తిత్వ వికాస నిపుణుడు కొండవీటి సురేష్ కుమార్‌ను పీఎంపాలెం పోలీసులు రిమాండ్ తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తన క్లినిక్‌కి కౌన్సెలింగ్ కోసం వచ్చిన ఇద్దరు బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతనిపై ఈ నెల 12వ తేదీన పీఎంపాలెం పోలీసు పోక్సో కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పీఎంపాలెం ఎస్ఐ అనుమకొండ సురేష్ కుమార్ చెప్పారు.

తాగునీటి వనరుల సంరక్షణకు చర్యలు

మహారాణిపేట: జిల్లాలోని సహజ తాగునీటి వనరుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల చేపట్టిన సర్వేలో గుర్తించిన చెరువుల అభివృద్ధికి సంబంధించి వ్యయ అంచనాలను రూపొందించాలన్నారు. జిల్లాలోని తాగునీటి వనరుల సంరక్షణ, ఇతర అంశాలపై కలెక్టరేట్‌లో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భవిష్యత్‌లో తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని, వనరులను కాపాడుకునేందుకు అన్ని విభాగాల అధికారులు బాధ్యతాయుతమైన కృషి చేయాలని పేర్కొన్నారు. ముంపు సమస్యలు తలెత్తకుండా కాలువలు, చెరువుల్లో పూడిక తీత చర్యలు చేపట్టాలన్నారు. వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణతో అన్ని విభాగాల అధికారులు ముందుకెళ్లాలని సూచించారు. రీ సర్వేలో భాగంగా కాపులుప్పాడ క్లస్టర్‌లో 8 ఎకరాలు, రామాపురం క్లస్టర్‌లో మెహాద్రి గెడ్డలో తాత్కాలిక ఆక్రమణలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. నరవలో 11.99 ఎకరాలు, వెంకటాపురంలో 1.5 ఎకరాలు, గాజువాకలో అర సెంటు స్థలం ఆక్రమణకు గురైనట్లు వివరించారు. అందులో కొంత మేర మతపరమైన, ఇతర కట్టడాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కాపులుప్పాడ క్లస్టర్ పరిధిలో రెండు చెరువులను పైలట్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

మహారాణిపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 27న శ్రేష్టత అవార్డులు అందజేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. 38 విభాగాలకు సంబంధించి 41 అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. www.aptourism.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని.. ఏపీ టూరిజం అథారిటీ, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు.

ఫుట్‌బాల్, జూడో జట్ల ఎంపిక రేపు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఫుట్‌బాల్, జూడో జట్ల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. జూడో పోటీలు అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆరోజు ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు నిర్వహించి తర్వాత జట్ల ఎంపిక చేపట్టనున్నారు. అలాగే ఫుట్‌బాల్ జట్ల ఎంపిక అదేరోజు ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు నిర్ణీత పత్రాలతో క్రీడా ప్రాంగణాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రపంచ బ్యాంకు మాటైనా వినండి చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ

అల్లిపురం: అమరావతి రాజధానిగా పనికిరాదని ప్రపంచ బ్యాంకు చెప్పిన మాటైనా చంద్రబాబు వినాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ హితవు పలికారు. వరదలకు మునిగిపోయిన అమరావతి చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాన్ని రాజధానిగా అంగీకరించేది లేదని, అందువల్ల ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో చంద్రబాబు తన ప్రయత్నాలనున విరమించుకోవాలని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2014లో ఆనాటి కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుత జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ, ఆనాటి సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తాను కలిసి మేధావులతో నిర్వహించిన సెమినార్‌లో శివరామకృష్ణ రిపోర్టు ఆధారంగా 56 రకాల పంటలు పండే భూములను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాజధానిగా విశాఖపట్నం అన్నివిధాలా అర్హతగలదని ఆంధ్రప్రదేశ్ ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

నేడు, రేపు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

మహారాణిపేట: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ జిల్లాలో బుధ, గురువారాల్లో పర్యటించనున్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ సంస్థల్లో జరిగే అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్టీల్ ప్లాంట్‌లోని ఎస్సీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో, 11 గంటలకు ఎస్సీ ఉద్యోగులతో రిజర్వేషన్ అమలు ప్రక్రియ, ఇతర ఇతర అంశాలపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పోర్టులోని ఎస్సీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో, 3 గంటలకు ఎస్సీ ఉద్యోగులతో సమావేశం కానున్నారు. 19న ఉదయం 10 గంటలకు షిపియార్డులోని ఎస్సీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో, 11 గంటలకు ఎస్సీ ఉద్యోగులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు తెలిపారు.

ఘనంగా అనంతుని జయంతి

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మంగళవారం అనంత పద్మనాభ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా స్వామిని సుప్రభాత సేవతో మేల్కొపారు. అనంతరం కుంతీ మాధవస్వామి, అనంతుని ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా రూపొందించిన వేదిక వద్దకు తోడ్కొని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్రతాలు జరిగాయి. పరిసర ప్రాంతాలతోపాటు విజయనగరం, విశాఖపట్నం, సింహాచలం, భీమునిపట్నం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన దంపతులు వ్రతాలు జరిపారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఆర్డీవో భాస్కర రెడ్డి, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, తహసీల్దార్ ఆనంద్ కుమార్, పద్మనాభం సర్పంచ్ దంపతులు తాలాడ పాప, పద్మనాభం తదితరులు అనంతుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీన ఆలయంలో జరగనున్న సత్యనారాయణ స్వామి సామూహిక వ్రత కరపత్రాలను ఈ సందర్భంగా ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆవిష్కరించారు.



వ్రతాలు చేస్తున్న దంపతులు